ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025
5
శ్రీ సత్యసాయి





కొత్తచెరువులో డిడిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్


డివిజన్ అభివృద్ధి కార్యాలయాలు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం
కొత్తచెరువులో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి- కొత్తచెరువు, ధర్మవరం రూరల్

జిల్లాలో ధర్మవరం, కొత్తచెరువు ప్రాంతాల్లో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్ అభివృద్ధి కార్యాలయాలు గురువారం ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్‌గా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీటిని ప్రారంభించారు. జిల్లాలో కొత్తచెరువులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివద్ధి శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకే డివిజనల్ అభివద్ధి అధికారి(డిడిఒ) కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ కార్యాలయం ఏర్పాటు ద్వారా ప్రజలకు ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మరింత త్వరగా వారి దరికి చేర్చే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ కింద సంబంధించిన అభివృద్ధి పనులు నిర్వహించడానికి వీటి ద్వారా సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్ రెడ్డి, డిపిఒ సమత, ఉపాధి పీడీ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో నటరాజు, ఏపీవో సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు, ఇన్‌ఛార్జి కార్యదర్శి జనార్దన్ రెడ్డి, పిఆర్‌జెఇ నాగరాజు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం డివిజన్‌కు కేటాయించిన నూతన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయన్ని పట్టణంలోని పార్థసారథి నగర్‌లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీష్ బాబు పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలకు సంబంధించిన అన్ని సేవలను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకురావడానికి, పరిపాలనా వ్యవస్థను పారదర్శకంగా చేసేందుకు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.



నిధుల మళ్లింపుపై మీనమేషాలు..!

◆ లెక్కలు తేలినా చర్యలు శూన్యం ◆ పశుసంవర్ధక శాఖ అవినీతిపై చర్యలేవీ..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పశుసంవర్ధక శాఖలో వెలుగులోకి వచ్చిన అవినీతిపై ఇప్పటి వరకు చర్యల్లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే రాష్ట్ర ఆడిట్ అధికారులు కూడా నిధుల మళ్లింపుపై విచారణ చేపట్టి ప్రభుత్వ సొమ్మును ఏ రకంగా దుర్వినియోగం చేసారన్నది తేల్చింది. ప్రధానంగా నలుగురు వ్యక్తులు ప్రభుత్వ ఖాజానలో ఉండాల్సినవి తమ సొంత ఖాతాల్లోకి మళ్లించడం డ్రా చేయడం జరిగింది. ఈ రకంగా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులైలోపు రూ.1.01 కోటి రూపాయల నిధులను కాజేశారు. ఈ విషయాలను స్పష్టంగా తేలినప్పటికీ ఇప్పటి వరకు వారిపై కనీస చర్యల్లేకపోవడం గమనార్హం.

అనుమతుల్లేకుండానే రూ.1.01 కోటి డ్రా

అనంతపురం పశుసంవర్ధక శాఖకు సంబంధించి వివిధ పద్దుల కింద ఐదు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. వీటిల్లో వాడకుండా ఉన్న డబ్బులు కొన్నేళ్లుగా ఉంటూ వస్తున్నాయి. వాటిని వాడాల్సి ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఈ రకంగా ఐసిఐసిఐ, యాక్సిస్, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కోటాక్ మహంద్రా బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. ఈ ఖాతాల్లో నుంచి నలుగురు వ్యక్తులు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులైలోపు ఎటువంటి అనుమతుల్లేకుండానే నలుగురు సిబ్బంది డబ్బులను డ్రా చేయడంతోపాటు నేరుగా ఇతర ఖాతాల్లోకి ఆర్టీజీఎస్ ద్వారా మళ్లింపు చేసిన దాఖలాలున్నాయి. మొత్తంగా రూ.1.01 కోటి రూపాయలు ఈ రకంగా మళ్లించారు. ఇందులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నుంచి రూ.15 లక్షలు, ఐసిఐసిఐ బ్యాంకు నుంచి రూ.22 లక్షలు, యాక్సిస్ బ్యాంకు నుంచి రూ.27 లక్షలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి రూ.15 లక్షలు డ్రా చేసినట్టు విచారణలోనూ గుర్తించారు.

నలుగురు పేరుతో నగదు డ్రా

పశుసంవర్ధక శాఖలో నిధులు కాజేసిన వ్యవహారంలో నలుగురు వ్యక్తుల పేర్లు బయటకొచ్చాయి. ఇందులో ఆంజినేయులు నాయక్ నేరుగా ఆయన పేరున డ్రా చేసిన మొత్తం రూ.11.94 లక్షలుంది. అదే కార్యాలయంలో పనిచేసే మరో మహిళా ఉద్యోగిని బి.సుశీల పేరున రూ.12.72 లక్షలు చేశారు. వీరు కాకుండా గాండ్ల దినేష్ పేరున రూ.16.09 లక్షలు, రమావత్ వంశీ పేరున రూ.12.25 లక్షలు నేరుగా డ్రా చేశారు. ఇక ఈఏడాది జులైలో ఎటువంటి అనుమతుల్లేకుండానే రూ.23.40 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా వేరే ఖాతాలకు మళ్లించారు. ఏప్రిల్‌లో ఆరు లక్షలు, జూన్‌లో రూ.6.50 లక్షలు వేరే ఖాతాల్లోకి మళ్లించారు. ఈ రకంగా మొత్తం రూ.1.01 కోటి ఇప్పటి వరకు మళ్లించినట్లు ఆధారాలున్నాయి. ఇవికాకుండా ఇతర పద్దుల కిందనున్న వాటిని మళ్లించినట్టు సమాచారం. దీనికి సంబంధించి ఆధారాలు లభించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో చాలాకాలంగా ఇక్కడే పాతుకుపోయి పనిచేస్తున్న ఒక ఉద్యోగికి కీలకపాత్ర పోషించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఇప్పటి వరకు చర్యలు శూన్యం

పశుసంవర్ధక శాఖలో ఇప్పటి వరకు ఇంత పెద్దఎత్తున నిధులను దారి మళ్లించి ప్రభుత్వ సొమ్మును కాజేసినప్పటికీ ఎటువంటి చర్యల్లేవన్న విమర్శలున్నాయి. నలుగురు నేరుగా నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసినట్టు ప్రాథమిక విచారణలోనే స్పష్టమైంది. అయితే వీరిపై ఇప్పటి వరకు అధికారిక చర్యలేవి లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ ప్రజలకు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యాధి చిగర్ మైట్స్ అనే సూక్ష్మ పురుగుల కాటుతో వ్యాపిస్తుందన్నారు. "స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రారంభదశలో గుర్తిస్తే సులభంగా నయం అవుతుంది. ఆలస్యమైతే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, అవయవాల వైఫల్యం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 2024లో 231 నమూనాలు పరీక్షించగా 29 పాజిటివ్ వచ్చాయని, 2025లో 99 నమూనాలు పరీక్షించగా ఇప్పటివరకు 6 పాజిటివ్‌గా నమోదయ్యాయని తెలిపారు. ప్రస్తుత మాన్సూన్ అనంతర కాలం కారణంగా పొదలు, గడ్డి పుంతల్లో చిగర్ మైట్స్ విస్తరిస్తుండటమే కేసుల పెరుగుదలకు కారణమని ఆరోగ్య శాఖ తెలియజేసిందన్నారు. 5 రోజులకంటే ఎక్కువ జ్వరం ఉండటం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు, కాటు వేసిన చోట నలుపు మచ్చ, బలహీనత, రాషెస్ తదితర లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఇళ్ల చుట్టూ ఉన్న పొదలు, గడ్డి, చెత్త మొక్కలను తొలగించుకోవాలన్నారు. తప్పనిసరిగా దోమ తెరలు వాడాలన్నారు. నేలపై నేరుగా కూర్చోకూడదు, పడుకోకూడదన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

జిల్లాలోని పిహెచ్‌సి, సిహెచ్‌సిలు ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండి చికిత్సలు అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఎలిశా రాపిడ్ టెస్టులు అందుబాటులో ఉంచాలన్నారు. డాక్సిసైక్లిన్, అజిత్రమైసిన్ నిల్వలు సమీక్షించి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, గ్రామ సభల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖతో కలిసి ఇళ్ల చుట్టూ పొదలు ఉంటే తొలగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గంజాయి నియంత్రణలో 'కూటమి' విఫలం

◆ విద్యారంగ సమస్యలపై పోరాటం ◆ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ ◆ గుంతకల్లులో అనంతపురం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ విమర్శించారు. రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ 33వ జిల్లా మహాసభలు గుంతకల్లు పట్టణంలో గురువారం ముగిశాయి. మహాసభల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి ముఠాలుగా ఏర్పడి విచ్చలవిడిగా గంజాయిని అమ్ముతున్నారని తెలిపారు. దీని వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ఓవైపు ప్రభుత్వం గంజాయిని అరికడతామని, డ్రగ్స్ నియంత్రిస్తామని గొప్పలు చెబుతున్నా ఆచరణలో మాత్రం కన్పించలేదన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత మారుస్తామంటూ చెబుతున్న మాటలు నీటిమూటలుగా మారాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలు మాని చేతల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులు భోజనాలు చేయడానికి డైనింగ్ హాల్ లేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో తాగునీటికి దిక్కు లేదన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో ప్రయివేటు కళాశాలల యజామాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. పిపిపి పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనుక్కు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. మహాసభలో పట్టణ నాయకులు కిషోర్, హనీఫ్, జాక్, పవన్ పాల్గొన్నారు.

అధ్యక్ష కార్యదర్శులుగా తరిమెల గిరి, ఓతూరు పరమేష్

మహాసభల్లో భాగంగా ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులుగా తరిమెల గిరి, ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, ఆఫీసు బెరర్లుగా బంధు శివ, రాచపల్లి సూర్యప్రకాష్, వెంకటేష్, భీమేష్, నవీన్, హారుణ్ రషీద్, శాంతిరాజ్‌ను ఎన్నుకున్నారు.



మోడల్‌పేపర్లను చూపుతున్న విద్యార్థులు

'పది' విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - కొత్తచెరువు

యుటిఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదోతరగతి మెడల్ పేపర్లను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కొత్తచెరువులోని బాలికల ఉన్నత పాఠశాలలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేశారు. వీటిని దాతల సహకారంతో ఉచితంగా అందిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి



పెనుకొండలో పోస్టరు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం విజయవంతం చేయాలని కార్మికసంఘాల నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద చలో విశాఖ గోడ పత్రిక ను కార్మిక సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ విశాఖపట్నం లో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగు సిఐటియు ఆలిండియా మహాసభలకు కర్షక, కార్మిక వర్గాలు హాజరుకావాలన్నారు.కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ప్రజలతో కార్మికులతో బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రజలు కార్మికులు విరివిగా పాల్గొని సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బావమ్మ, మాబున్నీసా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, వెంకటరాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిప్పన్న, నరసింహ, సివిల్ సప్లై యూనియన్ నాయకులు సుధాకర్, హనుమంతు, వలి, సిఐటియు నాయకులు హబీబ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, నాగమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : ఈనెల 31 తేదీన విశాఖలో జరిగే 18 వ సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి అంకె ముత్యాలు కోరారు. పుట్టపర్తి మండల పరిధిలో ని మామిళ్ళకుంట క్రాస్ వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం సభ్యులు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : సిఐటియు అఖిలభారత 18 మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక నాయకులు వివి రమణ, కుల్లాయప్ప తదితరులతో కలసి మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, తిప్పన్న ,గంగాద్రి, తదితరులు పాల్గొన్నారు.

డీడీవోల ఏర్పాటు చారిత్రాత్మకం : మంత్రి సవిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పంచాయతీ రాజ్ వ్యవస్థలో నూతన సంస్కరణలతో కూటమి ప్రభుత్వం పాలనను ప్రజల చెంతకు చేర్చిందని, ప్రజా సమస్యల పరిష్కారానికి డీడీవో కార్యాలయాల ఏర్పాటు చారిత్రాత్మకమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. డివిజనల్ స్థాయిలో అన్ని కార్యాలయాలనూ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వల్ల అటు ప్రజలకు, ఇటు పాలనకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. తమ ప్రభుత్వం ప్రజల అభ్యున్నతి కోసం కార్యాలయాలు నిర్మిస్తుంటే, ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదికను కూల్చిన ఘనత జగన్‌ది అని విమర్శించారు. పట్టణంలోని పిఆర్ అతిథిగృహాన్ని డిడిఒ కార్యాలయంగా పున్న నిర్మాణం చేశారు. గురువారం నిర్వహించిన డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ముందుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థలో సంస్కరణలు నాంది పలికిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఈ నిర్ణయం ఎంతో చారిత్రాత్మకమని కొనియాడారు. డివిజన్ స్థాయిలో అభివద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వల్ల అటు ప్రజలకు, ఇటు పాలనకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. డీడీఓ కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా ప్రజా సమస్యల పరిష్కారానికి మంచి వేదికలవుతాయన్నారు. డీడీఓ కార్యాలయాలకు శాశ్వత భవనం ఉండేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కు మంత్రి సవిత సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ పనితీరే తమ స్ఫూర్తి అని మంత్రి సవిత తెలిపారు. తాము చిరకాలంగా కోరుతున్న ప్రమోషన్లు రావడంతో పంచాయతీరాజ్ ఉద్యోగులు ఎంతో ఆనందంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వం పట్ల, డిప్యూటీ సీఎం పట్ల వారు ఎంతో కృతజ్ఞత చూపుతున్నారని వివరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. డివిజన్ స్థాయిలో ఉన్న అన్ని శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ... డీడీవో కార్యాలయాలను మినీ కకలెక్టర్లగా రూపొందిస్తోందని తెలిపారు. ఇలా అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండడం వల్ల పాలనా సౌలభ్యం కలుగడమే కాకుండా ప్రజా సమస్యలకు కూడా తక్షణ పరిష్కారాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, యాదవ, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, డి.వి.ఆంజనేయులు, డీడీవో రామకష్ణయ్య, పిఆర్ ఈఈ మురళీ, ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు శ్రీరాములు యాదవ్, ఈశ్వర ప్రసాద్, త్రివేంద్రనాయుడు, రఘువీరా చౌదరి, ఏనుమల రామకృష్ణ, హనుమంతు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం వరకు కృష్ణాజలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర టౌన్



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, తదితరులు

మడకశిర ప్రాంతంలోని అమరాపురం మండలం వరకు కృష్ణా జలాలను అందించడమే తమ ధ్యేయమనిఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని హరే సముద్రం చెరువు నిండడంతో గొల్లపల్లి పంప్ హౌస్ 46వ ప్యాకేజీ వద్ద గల 14వ పంప్ హౌస్ నుండి బటన్ ఆన్ చేసి అమరాపురం కాలువకు నీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ కర్నాటక సరిహద్దు ప్రాంతం చివరిలో ఉన్న అమరాపురం చెరువును కృష్ణాజలాలతో నింపి ఆ ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. మొట్టమొదటిసారి అమరాపురం వరకు కృష్ణా జలాలను అందిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కన్వీనర్ నాగరాజు, హెచ్ ఎన్ ఎస్ ఎస్ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - మడకశిర టౌన్

భక్తరహళ్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడు గుంట ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవంగా కొనసాగింది. ఈ రథోత్సవం కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దేవదాయ శాఖ అధికారి నరసింహారాజు హరే సముద్రం, వైబిహళ్లి గ్రామ సర్పంచులు కగ్రీయన్న, రామాంజనేయులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. **నేడు భూతప్పల ఉత్సవం :** బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం భూతప్పల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి నర్సింహారాజు తెలిపారు. అనంతరం ఆలయంలో పొంజు ఉత్సవం, రాత్రికి ముత్యాల పల్లకి ఉత్సవం జరగనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

అరటి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు కెకె. రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ బాబూరావుకు గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి పంటల సాగు చేసిన రైతులు మండలంలో దాదాపు 70 మంది రైతులు కదిరి ఎడిసిసి బ్యాంకులో దీర్ఘకాలికంగా రుణాలు తీసుకున్నారన్నారు. ప్రతి సంవత్సరం బ్యాంకు వడ్డీ చెల్లిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం వడ్డీ చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు నోటీసులు పంపించి రైతుల పైన ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. గిట్టుబాటు ధర లేక రైతులు ఒక పక్క ఇబ్బందులు పడుతుంటే రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేయడం తగదన్నారు. ఈనేపథ్యంలో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో రోడ్డు కి ఇరువైపుల దుకాణాల ముందు ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలు ఉంచితే చర్యలు తప్పవని డీఎస్పీ శివనారాయణ స్వామి దుకాణాల యాజమానులకు ఫుట్ పాత్ పెట్రోలింగ్ లో భాగంగా పట్టణ సీఐ నారాయణరెడ్డితో పట్టణంలో పర్యటించారు. ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ట్రాఫిక్ మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాబ్జాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - కదిరి టౌన్

బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. గురువారం కదిరి మండల పరిధిలోని కుమ్మర వాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు రెడ్స్ సంస్థ అధ్యర్యములో బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పిల్లల తల్లిదండ్రుల అవగాహనా లోపంతో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. చాలా చోట్ల బాల్య వివాహాలను రెడ్స్ సంస్థ ఆపిన విషయాలను ఆయన గుర్తు చేశారు. బాల్యవివాహాలను ప్రతిఒక్కరు వ్యతిరేకించాలని అయన పిలుపు నిచ్చారు ఈసందర్భంగా కెఎస్సిఎఫ్ కోర్డినేటర్ మనోహర్ తదితరులు గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో రెడ్స్ ప్రతినిధి మెహతాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులోకి కలుషిత నీరు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు గ్రామంలోని కొండ కింద ప్రాంతంలోనే మురుగునీటి కాలువ ద్వారా వెళ్లే నీరు బుక్కపట్నం చెరువులోకి చేరి నీరు కలుషితమవుతోందని దీన్ని అరికట్టాలని మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న కోరారు. గురువారం కొత్తచెరువులో డి డి ఓ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన కలెక్టర్‌ను కలిసిన పాపన్న వినతిపత్రాన్ని అందజేశారు. చెరువులోకి కలుషిత నీరు చేరడం ద్వారా తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ నీటిని అక్కడికి వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చెరువు కట్టపై ఉన్న ముళ్ల కంపచెట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

కొండకమర్లలో సమస్యల కొలువు

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని కొండకమర్ల గ్రామంలో సమస్యలు కొలువుతీరాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన మురుగునీరు నిల్వ ఉంటోంది. తేలికపాటి వర్షం వచ్చినా అక్కడ నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. సమస్యను పలు మార్లు ఎంపీడీవో శివ ప్రసాద్ రెడ్డి, ఈవోఆర్డి అంజినప్ప, గ్రామపంచాయతీ కార్యదర్శి మద్దిలేటి రెడ్డి దృష్టికి తీసుకుపోయినా వారు పట్టించుకోవట లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

6న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో ఈనెల 6న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సత్య సాయి సేవాసమితి సభ్యులు తెలిపారు. సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా సాయిధామ్ లండన్ వారిచే ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అలాగే 7 తేదీ సరస్వతి భవనం పక్కన మార్కెట్ రోడ్డు కర్ణాటక నాగేపల్లి వద్ద వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

13 నుంచి ఆల్ ఇండియా చెస్ టోర్నీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ సీతా రామాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో ఈ నెల 13, 14వ తేదీలలో ఆల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు యువర్ ఫౌండేషన్ నిర్వాహకులు, అనంతపురానికి చెందిన హాయ్ బ్రో చెస్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలను ఎస్ నాగమణి మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు డిసెంబర్ 10వ తేదీ లోపు తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9912647370కు సంప్రదించాలని చాంద్ భాషా, ఈశ్వరప్ప, జాకీర్ హుస్సేన్, షీలా నాగేంద్ర, జయరాం, బండ్లపల్లి రంగనాథ్, రాధాకష్ణ, వైకే శ్రీనివాసులు, బాలం ఆదిశేషులు, కర్రే రమేష్ బాబు, ఎస్ వాసు తెలిపారు.

ఘంటసాల జయంతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా పట్టణంలోని కళాజ్యోతిలో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాజ్యోతి అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్ తదితరులు మాట్లాడుతూ ఘంటసాల సినీరంగానికి, సాహిత్యరంగానికి చేసిన సేవలను వివరించారు. ఈనెల 27వ తేదీన కళాజ్యోతిలో ఘంటసాల జయంతిని పురస్కరించుకొని సాయంత్రం పాటల కచేరికార్యక్రమము ఉంటుందని, స్థానిక కళాజ్యోతి కళాకారులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ కారదర్శి అశ్వర్థ నారాయణ, డైరెక్టర్ రమేష్ బాబు, పెద్దారెడ్డి, రాంప్రసాద్, ఎల్ఐసి రామకష్ణ, మధుసూదన్, డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని సచివాలయం 1,2లను డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసులు గురువారనం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సచివాలయం సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. . విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. పేస్ యాప్ అటెండెన్స్‌ని సకాలంలో వేయాలన్నారు. మూమెంట్ రిజిస్టర్‌లో సిబ్బంది వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా పలు రికార్డు లను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, కవిత సిబ్బంది పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పరిశ్రమల స్థాపన పేరిట రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కుంటే సహించేది చేయలేదని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ కుమార్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హిందూపురం లేపాక్షి మండలాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం రైతుల నుండి భూములను తీసుకోవడం గురించి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో వాస్తవ సేకరణ కమిటీ హిందూపురం మండలంలోని నందమూరి నగర్, మలుగూరు, చలివెందుల, రాచపల్లి, బాలంపల్లి, చెర్లోపల్లి, లేపాక్షి మండలంలోని కొండూరు, లేపాక్షి గ్రామాల్లో పర్యటించిందన్నారు. పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయడం కోసం భూములను సేకరిస్తున్నట్లు సెప్టెంబర్ 4న మలుగూరు, బాలంపల్లి, చలివెందుల గ్రామ సచివాలయాలకు నోటీసులు పంపినట్లు రైతులు చెప్పారన్నారు. ఆ నోటీసుల్లో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన భూములను వెనక్కు తీసుకున్నట్లు పేర్కొనడం జరిగిందన్నారు. అయితే తాము గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా భూములన్నింటిలో రైతులు స్వాధీనంలో ఉంచుకొని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో కొన్ని తోటలలో మామిడి, వక్క, అరటి, మల్బరీ, వరి తదితర పంటలు బోరు బావుల ద్వారా సాగు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన భూసేకరణ చట్టం ప్రకారం రైతు భూములకు ఏ విధమైన పరిహారం చెల్లిస్తారో అదేవిధమైన పరిహారాన్ని అసైన్ మెంట్ భూములకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం మేరకు గ్రామాలలో ప్రజాభిప్రాయ సేకరణ, సాంఘిక పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని అక్కడ ఉన్న కుటుంబాలన్నిటికీ నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో రైతులను విచారించినప్పుడు ఒక మలుగూరు గ్రామానికి మాత్రమే రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వచ్చినట్లు తెలిసిందన్నారు. మిగిలిన ఏ గ్రామంలో కూడా గ్రామ సభలు జరిపి భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాన్ని సేకరించినట్లుగా ఎవరూ చెప్పలేదని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో సాంఘిక పరిస్థితుల అంచనా కార్యక్రమాన్ని చేపట్టలేదని రైతుల పేర్కొన్నట్లు తెలిపారు. చట్ట ప్రకారంగా భూసేకరణను చేపట్టినట్లు కనిపించడం లేదన్నారు గ్రామాల్లో భూములు కలిగిన రైతులకు మాత్రమే కాకుండా, భూములు లేని వ్యవసాయ కూలీల జీవనాధారంగా ఉపాధిని కల్పిస్తున్న భూములను రైతుల నుండి తీసుకోవడం సమంజసం కాదన్నారు. భూములు కోల్పోతున్న రైతులు, రైతు కూలీలకు భవిష్యత్తులో ఏర్పాటయ్యే పరిశ్రమలలో ఏ విధమైన ఉద్యోగాలు కల్పిస్తారన్న విషయంపై ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టత లేదన్నారు. గ్రామాల్లో రైతులెవ్వరూ తమ భూములను ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. ప్రభుత్వాధికారులు తమ గ్రామాలలోకి వచ్చి ఈ భూ సేకరణ చేస్తున్నట్లు చెప్పలేదని రైతులు చెబుతున్నారన్నారు. అయితే కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తమ గ్రామాల్లోకి వచ్చి తమతో బేరసారాలు సాగిస్తున్నారని తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. గత సంవత్సరం రైల్వే లైనుకు, నేషనల్ హైవే వేయడానికి భూసేకరణ జరిపినప్పుడు భూములు కోల్పోయిన రైతులకు రూ.28 లక్షల నష్టపరిహారం చెల్లించారని అన్నారు. అయితే ప్రస్తుతం టేకులోడు గ్రామంలో రూ.12.60 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇంతకుమించి నష్టపరిహారం రాదని ప్రైవేటు వ్యక్తులు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ విషయంలో జోక్యం చేసుకొని భూములు సాగు చేసుకుంటున్న రైతుల అభిప్రాయానికి వ్యతిరేకంగా భూసేకరణ జరపకుండా ఆ భూములన్నింటినీ రైతులకే దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఓపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాయకుంట్ల శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, పట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధారెడ్డి, జలసాధన సమితి నాయకులు చైతన్య గంగిరెడ్డి, జమీల్, అమానుల్లా, రైతు కూలీ సంఘం నాయకులు కాసీం, కార్మిక నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

పిటిఎంలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చొద్దు


ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యార్థులకు విద్యా బుద్దులు నేర్పించాల్సిన పాఠశాలలను రాజకీయ వేదికలుగా మార్చొద్దని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో జరుగునున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలలో పాల్గొనమని తెలుగుదేశం కార్యకర్తలకు ముఖ్యమంత్రి పిలుపునివ్వడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. అధికారిక కార్యక్రమాలలో టీడీపీ కార్యకర్తలను పాల్గొనమని చెప్పడం పార్టీ ప్రభుత్వ కార్యకలాపాలకు తేడా లేకుండా చేయడమేనని విమర్శించారు. పాఠశాల అకాడమిక్ కార్యకలాపాలను అధికార పార్టీ రాజకీయ ప్రచారానికి వినియోగించుకోవడం సరైంది కాదన్నారు. విద్యా కమిటీలు, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలను మాత్రమే వీటికి అనుమతించాలన్నారు.. బయట వ్యక్తులు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థలలోకి ప్రవేశించారని ఒక పక్కన జీవో ఇచ్చి మరో పక్కన తమ పార్టీ కార్యకర్తలను మాత్రం విద్యాసంస్థలలోకి జరిగే సమావేశాలలో పాల్గొనమని చెప్పడం ప్రభుత్వ ద్వంద వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. విద్యాసంస్థలలో బయట వ్యక్తులని పేరుతో విద్యార్థి సంఘాలను నిషేధిస్తూ జారీ చేయడానికి రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు ప్రజాతంత్ర వాదులు మేధావులు అందరూ నిరసించినా ప్రభుత్వం తన మొండి వైఖరి కొనసాగిస్తోందని విమర్శించారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన పలువురు బాధితులను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని రాళ్ల అనంతపురం, సిద్ధన్న గారి పల్లి, బ్రహ్మదేవరి, ఈదులపల్లి, మర్తాడు, దొరిగల్లు, అడవి బ్రాహ్మణి పల్లి తండా, ముదిగుబ్బలో కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాల, బారిన పడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ సెక్రటరీ ఇందుకూరు నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, ధర్మవరం నియోజవర్గ మహిళా విభాగం నాయకురాలు జయమ్మ, సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, వైస్ ప్రెసిడెంట్ లోకేశ్వర్ రెడ్డి, ఉప కన్వీనర్ మీసేవ చంద్ర, మండల యూత్ గోగుల మనోహర్, మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకులు అజయ్‌సింగ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తప్పక వస్తుందని ఆపార్టీ పరిశీలకులు అజయ్ సింగ్ ,తులసి రెడ్డి, కమలమ్మ, పుట్టపర్తి సమన్వయకర్త దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పుట్టపర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి పరిశీలకులు, కర్నాటక ఎమ్మెల్యే డాక్టర్ అజయ్ సింగ్, రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ,మాజీ శాసన సభ్యురాలు కమలమ్మ, సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఇనయతుల్లా,కదిరి అసెంబ్లీ సమన్వయకర్త షాన్వాజ్ కోట సత్యం, పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాయలసీమకు ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఇవ్వకుండా ,విభజన చట్టంలోని అనేక అంశాలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు వైసిపి, టిటిపి, జనసేనలు బిజెపి చేతిలో కీలుబొమ్మలుగా మారి రాష్ట్ర శ్రేయస్సును మరిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావలసిన చారిత్రక ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ అధిష్టాన వర్గం చేపట్టిందని అందులో భాగంగా జిల్లా కమిటీని బలోపేతం చేసే పని లో భాగంగా సంఘటన శ్రీజన్ అభియాన్, కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న నాయకులు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 24 నుంచి ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పంటలకు గిట్టుబాటు ధర చట్టబద్ధత కల్పించాలని అదేవిధంగా ప్రస్తుతానికి పంటల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తి అవుతుందని ఈ 18 ఏళ్ల కాలంలో 45 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక చాలామంది రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు నష్టపరిహారం, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

తిరుపతిలో జరగనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున కోరారు. డిసెంబరు 12, 13, 14 తేదీల్లో జరగనున్న ఈ మహాసభ పోస్టర్‌ను గురువారం పట్టణంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా 12న తిరుపతిలో వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ, ఇందిరా మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 13, 14వ తేదీల్లో ప్రతి నిధుల సభ ఉంటుందన్నారు. ఈ మూడు రోజుల పాటు జరిగే మహాసభలో రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు చర్చించి విద్యారంగ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తామన్నారు. విద్యారంగ మేధావులు, ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు పాల్గొనే ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'పల్స్ పోలియో'ను విజయవంతం చేద్దాం : డిఎంహెచ్ఒ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 21 న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పుట్టపర్తి లోని సాయి ఆరామంలో డాక్టర్ సురేష్ బాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.నాగేంద్రనాయక్, డిపిఎంఒ డా.సునీల్ కుమార్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ ఓ కళాధర్ పాల్గొని ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా డిసెంబర్ 21 న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. మొదటిరోజు పల్స్ పోలియో బూత్ కార్యక్రమం ఉంటుందన్నారు. 2,3 వరోజులలో బృందం సభ్యులు రెండుబృందాలు గా విడిపోయి ఇళ్లవద్దకు వెళ్లి చుక్కలు పొందని పిల్లలను గుర్తించి వారికి వేయాలన్నారు. స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని ముందస్తుగా అవగాహన ర్యాలీలు,సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వైద్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం


ఆలయంలో జనసందోహం

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలోని హేమావతి గ్రామంలో గల సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన లక్ష దీపోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వమించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అధికారులు ఆర్ ఎం రమేషు, సీనియర్ మేనేజర్ నిత్య కుమార్, బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, నాయకులు శివకుమార్, సోమన్నతో పాటు బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. హేంజేరు సిద్దేశ్వర స్వామి అన్నదాసోహ సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.అ ఈ కార్యక్రమంలో ఎంజాయ్ సిద్ధేశ్వర స్వామి నిత్య అన్నదాతోఎంజాయ్ సిద్ధేశ్వర స్వామి నిత్య అన్నదాసోహ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అశ్వాత నారాయణ శెట్టి, మాజీ అధ్యక్షులు రామలింగారెడ్డి, అరవింద్ రెడ్డి, కార్యదర్శి గురునాథ్, డైరెక్టర్లు కేంకేర పాల్యం తిప్పేస్వామి, సత్యనారాయణ చారి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షదీపోత్సవం : మండల పరిధిలోని హేమావతి గ్రామంలోని సిద్దేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా లక్షద్వీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులు హాజరయ్యారు. అనంతరం లక్షద్వీపోత్సవ సందర్భంగా దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారస్వామి, పంచాయతీ అధ్యక్షుడు తిప్ప, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ జగన్నాథ్, నాయకులు రామచంద్ర యాదవ్, మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జై కుమార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చెన్నప్ప, సిరికల్చర్ నాగరాజు, గుణహళ్లి ఉమేష్, దయానంద్, మద్దనకుంట రఘు, రంగనాథ్ గౌడ్, కేంకేర భరత్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని మహమ్మాదాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసుకుని లాక్కెళ్లారు. మహమ్మాదాబాద్ గ్రామానికి చెందిన మౌలాబీ అనే వృద్ధురాలు రోడ్డుపై నడిచి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి వృద్ధురాలిని మాటల్లోకి దింపారు. ఈ సందర్భంగా ఆమె మెడలో ఉన్న గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటన కొద్దిదూరంలో ఉన్న సిసి కెమెరాల్లో రికార్డు అయింది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ విజయకుమార్, సిఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. స్టాకు నిర్వహణ, రిజిస్టర్లు సరిగా నిర్వహించనందున 34 లక్షల విలువచేసే ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా, మండల వ్యవసాయ అధికారి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో వ్యత్యాసం వస్తే చర్యలు

ప్రజాశక్తి- నంబులపూలకుంట

రేషన్ బియ్యం పంపిణీ సమయంలో తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ దేవేంద్ర నాయక్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని డీలర్ శ్రీరాములు రేషన్ షాప్‌ను తహశీల్దార్ తనిఖీ చేశారు. సరుకుల పంపిణీపై ప్రజలతో ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవిన్యూ అధికారి నాగరాణి, విఆర్ఎ రూప, గ్రామప్రజలు ఉన్నారు.


తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణ

ప్రశ్నించిన వారిపై ఫిర్యాదులు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కోడిగేనహళ్లి పంచాయతీ పరిధిలోని కాలువపల్లి గ్రామ సమీపంలోని శివాలయం వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన ఓ మహిళ ఆర్ అండ్ బి స్థలాన్ని అక్రమించింది. కొబ్బరి బొండాల దుకాణం పేరుతో అనధికారిక తాత్కాలిక షెడ్డు నిర్మించుకుంది. అయితే వ్యాపారం పేరిట రాత్రుల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ చీకటి సామ్రాజ్యం నడుపుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నించిన వారిపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేసిన దాఖలాలు కూడా గతంలో ఉన్నాయి. ఆమె నిర్వహించే అసాంఘిక కార్యకలాపాల ద్వారా వచ్చే అక్రమ సంపాదనతో మండలంలోని కొంతమంది రౌడీ మూకలకు, రౌడీ షీటర్లకు నెలసరి మామూళ్లు ఇస్తూ తన చీకటి వ్యాపారాన్ని నడుపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఈ దురాగతాన్ని ప్రశ్నించిన పక్కన ఉన్న భూ యజమానిపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా తన చీకటి సామ్రాజ్యానికి ఎటువంటి సమస్యలు, అడ్డంకులు రాకుండా డబ్బులకు కక్కుర్తి పడే కొంతమంది రాజకీయ నాయకులను సైతం తనవైపున తిప్పుకున్నట్లు ఆరోపణలున్నాయి. చీకటి పడగానే కొంతమంది యువకులు హిందూపురం పట్టణం నుంచి ద్విచక్ర వాహనాల్లో వచ్చి ఇక్కడ నిర్వహిస్తున్న దురలవాట్లకు బానిసలవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా సమీపంలో ఉండే ఫ్యాక్టరీ సిబ్బంది రాకపోకలకు ఆమె దుకాణం ముందు పార్కింగ్ చేసే వాహనాలు అడ్డంకిగా ఉన్నాయని వాటిని తొలగించాలని అడిగిన పాపానికి ఏకంగా వారిపైనే పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేయడం గమనార్హం. ఈ తతగంపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు గురువారం స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ముదిగుబ్బ

సిఐటియు మండల కన్వీనర్‌గా బాబ్జాన్‌ను ఎంపిక చేశారు. గురువారం మండల కేంద్రంలో సిఐటియు సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆటోపెద్దన్న అధ్యతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా కార్యదర్శి దిల్షాద్ తదితరులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో కామ్రేడ్ పెంచలయ్య మృతికి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం విధివిధానాలపై చర్చించారు. ఈసందర్భంగా సిఐటియు మండల కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా బాబ్జాన్,కో కన్వీనర్లుగా శ్రీరామ్ రెడ్డి, టైలర్ ముస్తఫా, కోశాధికారిగా రహీం, సభ్యులుగా మహబూబ్ బాషా, సూర్యనారాయణ, జయలక్ష్మి, పకీరప్ప, రిక్షా ముస్తఫా, శ్రీహరి, సావిత్రి, ఓబులేసు, రజియా, చికెన్ రఫీ, పకీరప్ప, నౌషాద్‌ను ఎన్నుకున్నారు.

అవగాహన కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ఇంటి పన్నులు పెరిగాయని దీనిపై ప్రజలకు ఉండే సందేహాన్ని నివృత్తి చేయడం కోసం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. కార్యాలయ ఆవరణము ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఆయన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రోజులపాటు ఈ ప్రత్యేక కౌంటర్ లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. అధిక పన్నులు ఎవరికైనా వచ్చి ఉంటే వారు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, నాగేంద్రమ్మ, రెవెన్యూ అధికారిణి విజయ భారతి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ షావలి, సచివాలయ సిబ్బందితో పాటు పన్ను చెల్లింపు దారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో వైసిపి బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేద్దామని ఆ పార్టీ నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి సూచించారు. గురువారం వివిధ వార్డులకు చెందిన ఇన్చార్జులు కోటి సంతకాల పుస్తకాలను పార్టీ కార్యాలయంలో వేణురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేసేందుకు చేస్తున్న చర్యలను తిప్పికొట్టేందుకు అధిష్ఠానం పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఈ కోటి సంతకాల సేకరణ ఎంతో విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా రూరల్ మండలం మలగూరు పంచాయతీకి సంబంధించి సర్పంచి రమేష్, ఎంపిటిసీ యాకాశప్పలు కోటి సంతకాల పుస్తకాలను అందించారు. అలాగే 27వ వార్డుకు సంబంధించి ఇన్‌చార్జ్ నవీన్, నరసింహులు, శివప్ప, కిరణ్, పృత్వీలు కోటి సంతకాల పుస్తకాలను వేణు రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ సంతెబిదనూరు రాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు అమీర్ ఖాన్, సీనియర్ నాయకులు రంగాపురం కొల్లప్ప, చలపతి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, శేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు సేకరించిన పుస్తకాలను వేణు రెడ్డికి అందిస్తున్న నాయకులు